క్లుప్తంగా

కడవకొల్లు ఉపసర్పంచ్‌గా రవిశంకర్ ఎన్నిక



ఉయ్యూరు: మండలంలోని కడవకొల్లు ఉపసర్పంచ్‌గా ఎనిమిదో వార్డు సభ్యుడు జొన్నలగడ్డ రవిశంకర్ ఎన్నికయ్యారు. స్థానిక పంచాయతీ కార్యాలయంలో ఉపసర్పంచ్ పదవికి సోమవారం ఎన్నిక నిర్వహించారు. ఎన్నికల అధికారి శ్రీనివాసరావు పర్యవేక్షణలో పదిమంది వార్డు సభ్యులకు ఏడుగురు హాజరయ్యారు. రవిశంకర్‌ను ఏడుగురు సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. దీంతో రవిశంకర్‌కు ఎన్నికల అధికారి శ్రీనివాసరావు ఎన్నికల ధ్రువీకరణ పత్రాన్ని అందజేశారు. సర్పంచ్ మంగినేని సుధారాణి, పీఏసీఎస్ చైర్మన్ జొన్నలగడ్డ నరేష్, పార్టీ శ్రేణులు, వార్డు సభ్యులు మిఠాయిలు తినిపించి అభినందించారు.

8న పేరంటాలమ్మ ఆలయంలో సామూహిక వరలక్ష్మీ వ్రతాలు

రామవరప్పాడు: విజయవాడ రూరల్ మండలం రామవరప్పాడులోని శ్రీ వెంకమ్మ పేరంటాలమ్మ ఆలయంలో శ్రావణ మాసాన్ని పురస్కరించుకుని ఈ నెల ఎనిమిదో తేదీన ఉచిత సామూహిక వరలక్ష్మి వ్రతాలు నిర్వహించనున్నట్లు ఆలయ చైర్మన్ బోయిన భాను ప్రదీప్, ఆలయ కార్యనిర్వహణాధికారి పి. లోకేశ్వరి సోమవారం తెలిపారు. వ్రతాల్లో పాల్గొనే భక్తులకు ఆలయం తరఫున పసుపు, కుంకుమ, గాజులు, ప్రసాదం ఉచితంగా అందజేస్తారని పేర్కొన్నారు. భక్తులు కలశం, కొబ్బరికాయ, రవిక వస్త్రం, ఉద్ధరిణి, పంచపాత్ర, పళ్లెం, హారతి, వత్తులు, నూనె, గంట, తమలపాకులు, అరటి పళ్లు వంటి పూజా సామగ్రి తెచ్చుకోవాలని సూచించారు. ఉదయం 9.30 గంటలకు ఉచిత సామూహిక వ్రతాలు ప్రారంభమవుతాయని తెలిపారు.

సమాజ శ్రేయస్సు కోసం పాటుపడాలి

పెనమలూరు: దైవభక్తి, సమాజ శ్రేయస్సు కోసం ప్రతి ఒక్కరూ పాటుపడాలని హైదరాబాద్‌కు చెందిన ఇమ్మానుయేల్ మినిస్ట్రీస్ అధినేత రెవరెండ్ జెర్మియా సూచించారు. పెనమలూరు సెంటర్‌లోని కిలారు ఎస్టేట్‌లో సోమవారం జరిగిన పెనమలూరు నియోజకవర్గ పాస్టర్ల ఆత్మీయ సమావేశంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. క్రైస్తవులు అందరు ఐక్యంగా ఉండి ఆత్మీయ వాతావరణం కోసం కృషి చేయాలని సూచించారు. ప్రపంచ శాంతికి అందరు కృషి చేయాలన్నారు. నియోజకవర్గ అధ్యక్షుడు వేమూరి జాన్‌క్రాస్, మూడు మండలాల అధ్యక్షులు బిషప్ పరంగి డానియేలు, మాచవరపు రాజేష్, స్టీఫెన్ పాల్గొన్నారు.

ఫ్రీజర్‌బాక్స్ వితరణ



హనుమాన్‌జంక్షన్(గన్నవరం): నిజమైన సేవకు మానవత స్వచ్ఛంద సంస్థ నిదర్శనమని రైస్ మిల్లర్స్ అసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షుడు పొట్లూరి సీతారాంప్రసాద్ పేర్కొన్నారు. ఈ మేరకు సోమవారం మానవతా స్వచ్ఛంద సంస్థకు రూ.70 వేల విలువైన ఫ్రీజర్ బాక్స్‌ను తన తల్లిదండ్రులు పొట్లూరి జగన్‌మోహన్‌రావు, రత్నమాణిక్యం జ్ఞాపకార్థం సీతారాంప్రసాద్ అదజేశారు. మానవత సంస్థ అందిస్తున్న సేవలు స్ఫూర్తిదాయకమన్నారు. గుడివాడలోని మానవత సంస్థకు కూడా మరో ఫ్రీజర్‌బాక్స్‌ను అందజేస్తామని ప్రకటించారు. పొట్లూరి పవనకుమార్, చలసాని సతీష్, సంస్థ చైర్మన్ మారుబోయిన కోటేశ్వరరావు, కార్యదర్శి క్లోపల్లి నారాయణరావు, ఉపాధ్యక్షుడు దయాల ప్రభాకరరావు తదితరులు పాల్గొన్నారు.

వృద్ధుడి మృతదేహం లభ్యం

కంకిపాడు: కాలువలో గల్లంతైన వృద్ధుడి మృతదేహం లభించింది. వృద్ధుడి మృతిపై స్థానిక పోలీసుస్టేషన్‌లో సోమవారం రాత్రి కేసు నమోదైంది. ఎస్ఐ కె.సుధాకర్ కథనం మేరకు.. మండలంలోని గొడవర్రు గ్రామానికి చెందిన తెనాలి మల్లికార్జునరావు (80) ఈ నెల రెండో తేదీన ఆస్పత్రికి వెళ్తున్నట్లు చెప్పి ఉప్పలూరు రైవస్‌కాలువ వద్ద వైద్య పరీక్షల ఫైల్ పెట్టి కాలువలోకి దిగడాన్ని సమీపంలో ఉన్నవారు చూశారు. ఫైల్‌పై ఉన్న ఫోన్ నంబర్ల ఆధారంగా కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. కుటుంబ సభ్యులు ఘటనాస్థలానికి చేరుకుని కాలువలో గాలింపులు చేపట్టారు. ఉయ్యూరు మండలం ఎగినపాడు వద్ద కాలువలో మల్లికార్జునరావు మృతదేహం సోమవారం లభ్యమైంది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉయ్యూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

జేఎన్‌టీయూకే పాలక మండలిలో అమీనాబీ

గుడ్లవల్లేరు: స్థానిక వీవీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ సైన్సెస్ కళాశాలలో అధ్యాపకురాలిగా పని చేస్తున్న డాక్టర్ ఎస్‌కే అమీనాబీని జేఎన్‌టీయూకే పాలక మండలిలో ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యురాలిగా నియమించారు. ఈ విషయాన్ని సోమవారం ఆ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ. లక్ష్మణరావు తెలిపారు. ఈ సందర్భంగా అమీనాబీని అధ్యాపకులు పలువురు అభినందించారు.

సంక్షేమ పాలనతో సువర్ణ అధ్యాయం

ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి



ఉయ్యూరు ఎస్సీ కాలనీలో ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే పార్థసారథి

ఉయ్యూరు: సంక్షేమ పాలనతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సువర్ణ అధ్యాయం లిఖిస్తున్నారని ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి పేర్కొన్నారు. ఉయ్యూరు పట్టణంలోని ఐదో వార్డు ఎస్సీ కాలనీలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం సోమవారం జరిగింది. తొలుత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, బాబూ జగ్జీవన్‌రాం, వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహాలకు ఎమ్మెల్యే పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఎమ్మెల్యే పార్థసారథి ఇంటింటికీ వెళ్లి సంక్షేమ బ్రోచర్లను అందించి ఆయా కుటుంబాలకు ప్రభుత్వం నుంచి అందిన లబ్ధిని వివరించారు. ప్రజా సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యే పార్థసారథి మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజా శ్రేయస్సే లక్ష్యంగా సుపరిపాలన అందిస్తున్నారని కొనియాడారు. నాలుగేళ్ల సంక్షేమ పాలనలో ప్రతి ఇంటికీ లబ్ధి చేకూరిందన్నారు. ఏ ఇంటికి వెళ్లి అడిగినా జగనన్న చేసిన మేలునే చెబుతున్నారని వివరించారు. ఉయ్యూరు ఎస్సీ కాలనీని అభివృద్ధి చేసిన ఘనత తమదేనన్నారు. గత టీడీపీ ఐదేళ్ల పాలనలో ప్రధాన రహదారిని నిర్మించలేకపోయిందని విమర్శించారు. బస్టాండు దగ్గర నుంచి విగ్రహాల సెంటరు వరకూ ఎస్సీల రహదారి కష్టాలను తీర్చిన ఘనత తమ ప్రభుత్వానిదేనన్నారు. రహదారుల అభివృద్ధి, డ్రెయిన్ల నిర్మాణాలపై ప్రత్యేక దృష్టి సారించి శరవేగంగా అభివృద్ధి చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ చైర్మన్ వల్లభనేని సత్యనారాయణ (నాని), కమిషనర్ పాయసం వెంకటేశ్వరరావు, వార్డు ఇన్‌చార్జి దిరిశం జ్యోతిర్మయి, నాయకులు ఈడుపుగంటి డేవిడ్, కలకట్ల డాలి, నందేటి ప్రవీణ్, మట్టా మనోజ్, ఉయ్యూరు సుధాకర్, మట్టా జగన్, కొక్కిలిగడ్డ హరుణ్, హనోక్, ప్రభుత్వాస్పత్రి చైర్మన్ జంపాన కొండలరావు, పార్టీ జిల్లా ఉపాధ్యక్షురాలు తెనాలి పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

మాజీ ఎంపీపీ కుటుంబానికి ఎమ్మెల్యే వంశీ పరామర్శ



విజయభాను చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్

అంబాపురం(విజయవాడరూరల్): వైఎస్సార్ సీపీ నాయకుడు, మాజీ ఎంపీపీ తోడేటి రూబేన్ కుటుంబాన్ని ఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్ సోమవారం పరామర్శించారు. రూబేన్ కుమారుడు తోడేటి విజయభాను ఇటీవల గుండె సంబంధిత వ్యాధితో మృతిచెందారు. ఆయన జ్ఞాపకార్థ కూడిక కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే వంశీమోహన్, రూబేన్ కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం విజయభాను చిత్రపటం వద్ద నివాళులర్పించారు. ఎంపీపీ చెన్ను ప్రసన్నకుమారి, జెడ్పీటీసీ సభ్యుడు కె.సువర్ణరాజు, మాజీ ఎంపీపీ యర్కారెడ్డి నాగిరెడ్డి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ దేవగిరి ఓంకార్‌రెడ్డి, పి.నైనవరం సర్పంచి బట్టా సోమయ్య, నల్లమోతు చంద్రశేఖర్, తోడేటి బెంజిమెన్, తోడేటి విజయకుమార్, దావు వెంకటేశ్వరరావు, దావు కోటేశ్వరరావు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరికీ సొంతిల్లు ప్రభుత్వ లక్ష్యం



ఉంగుటూరులో బోరు నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న ఎంపీపీ సరోజిని

ఉంగుటూరు: ప్రతి ఒక్కరికీ సొంత ఇల్లు ఉండాలన్నదే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని ఎంపీపీ వడ్లమూడి సరోజిని అన్నారు. మండల కేంద్రమైన ఉంగుటూరులోని జగనన్న కాలనీలో మండల పరిషత్ నిధులు రూ.10 లక్షలతో బోరు ఏర్పాటు పనులకు సోమవారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ.. జగనన్న కాలనీల్లో మౌలిక వసతుల కల్పనకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక నిధులు కేటాయిస్తోందని తెలిపారు. ప్రభుత్వ తోడ్పాటును సద్వినియోగించుకుని త్వరితగతిన గృహ నిర్మాణాలు పూర్తి చేయాలని సూచించారు. బోరు నిర్మాణం పనులు త్వరితగతిన పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌ను కోరారు. సర్పంచ్ కాటూరి వరప్రసాద్, వైస్‌ఎంపీపీ-2 చంద్రశేఖర్, ఎంపీడీఓ శేషగిరిరావు, హౌసింగ్ ఏఈ సురేష్, ఎంఈఓ-2 సాంబశివరావు పాల్గొన్నారు.

ఇంజినీరింగ్ విద్యార్థులు ఆశయంతో చదవాలి



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న ఇమ్మానుయేలు

నున్న(విజయవాడరూరల్): ఇంజినీరింగ్ విద్యార్థులు ఆశయంతో చదివితే లక్ష్యాన్ని చేరుకోవచ్చని పెంటామ్ ఫౌండేషన్ సౌత్ ఇండియా ప్రాజెక్టు మేనేజర్ ఎం.ఇమ్మానుయేల్ సూచించారు. స్థానిక వికాస్ ఇంజినీరింగ్ కళాశాలలో మొదటి సంవత్సరం విద్యార్థులకు సోమవారం ఓరియంటేషన్ కార్యక్రమం జరిగింది. ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఇమ్మానుయేలు మాట్లాడుతూ.. ఇంజినీరింగ్ విద్యార్థులు చదువుపైనే శ్రద్ధపెట్టి చదువుతూ స్కిల్స్ డెవలప్ చేసుకోవాలని సూచించారు. వికాస్ విద్యాసంస్థల చైర్మన్ నరెడ్ల నర్సిరెడ్డి మాట్లాడుతూ.. ఇంజినీరింగ్ విద్యార్థులు తొలి సంవత్సరం నుంచే ప్రణాళికతో చదవాలని సూచించారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ ఎస్.సత్యనారాయణరెడ్డి, ప్రిన్సిపాల్స్ డాక్టర్ బి.వి. రెడ్డి, డాక్టర్ పి.శ్రీనివాసరావు, ట్రైనింగ్ ప్లేస్‌మెంట్ అధికారి కిషోర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక అక్షరాస్యత చైతన్య రథం ప్రారంభం



ప్రచార రథాన్ని ప్రారంభించిన కోస్టల్ బ్యాంక్ సీజీఎం రామన్, బ్యాంక్ అధికారులు

మొగల్రాజపురం(విజయవాడతూర్పు): బ్యాంక్ ఖాతాదారులకు ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కల్పించేందుకు తమ బ్యాంక్ ఆధ్వర్యంలో ఆర్థిక అక్షరాస్యత చైతన్య రథాన్ని ప్రారంభిస్తున్నామని కోస్టల్ బ్యాంక్ చీఫ్ జనరల్ మేనేజర్(సీజీఎం) కె.ఎ.వి.రామన్ తెలిపారు. గాయత్రీనగర్ ప్రధాన రహదారిలోని కోస్టల్ బ్యాంక్ ప్రధాన కార్యాలయం దగ్గర ఈ రథాన్ని రామన్ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ చైతన్య రథం తమ బ్యాంకు శాఖల వద్ద, జనాల రద్దీ ప్రాంతాల్లో బ్యాంక్ పథకాలపై ప్రచార కార్యక్రమాలపై వివిధ రూపాల్లో అవగాహనా కార్యక్రమాలు నిర్వహిస్తుందని చెప్పారు. ప్రధాన మంత్రి సురక్ష బీమాయోజనలో సంవత్సరానికి కేవలం రూ.20 చెల్లిస్తే రూ.2 లక్షల ప్రమాద బీమా లభిస్తోందన్నారు. వార్షిక ప్రీమియం రూ.436 చెల్లిస్తే ప్రధాన మంత్రి జీవన్‌జ్యోతి బీమా యోజనలో రూ.2 లక్షల వరకు జీవిత బీమా లభిస్తుందని వివరించారు. బ్యాంక్ ఖాతాదారులకు ఎంతో సౌలభ్యంగా ఉండే డిజిటల్ బ్యాంకింగ్ లావాదేవీలను సురక్షితంగా, సులభంగా ఎలా నిర్వహించుకోవచ్చు అనే అంశాలపై కూడా ప్రచారం నిర్వహిస్తారన్నారు. మహిళలకు డిపాజిట్లపై అత్యధికంగా 8.5 శాతం వడ్డీని అందజేస్తున్నామని రామన్ చెప్పారు. కోస్టల్ బ్యాంక్ చీఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ ఆఫీసర్ సురేష్ అగ్రావాలాతో పాటుగా బ్యాంక్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

భవిష్యత్‌లో అంతా డిజిటల్ చదువులే



శిక్షణ ఇస్తున్న నోడల్ పర్సన్స్ శివాజీ, దావూద్

పామర్రు: రానున్న భవిష్యత్‌లో అంతా డిజిటల్ విధానం ద్వారా విద్యాబోధన ఉంటుందని దీనికి సన్నద్ధం కావాలని జిల్లా నోడల్ పర్సన్స్ పడవల శివాజీ, మహ్మద్ దావూద్ పేర్కొన్నారు. స్థానిక ఎంఈఓ కార్యాలయం వద్ద మండలంలోని పాఠశాల హెచ్‌ఎంలకు బైజూస్ ట్యాబ్స్ వినియోగంపై సోమవారం శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు ఈ ట్యాబ్స్‌ను ఏవిధంగా వినియోగించాలనే అంశాలను తెలిపామన్నారు. రానున్న కాలంలో విద్య అంతా డిజిటల్ బోధనపైనే ఆధార పడుతుందని దీని కోసం ఇప్పటి నుంచి డిజిటల్ బోధనపై ఉపాధ్యాయులు, విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని అన్నారు. బైజూస్ ట్యాబ్‌లను ఏవిధంగా సద్వినియోగం చేసుకోవాలో తెలియజెప్పామన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, నోడల్ టీచర్స్, డిజిటల్ అసిస్టెంట్స్, ఎడ్యుకేషన్ అండ్ వెల్ఫేర్ అసిస్టెంట్లు, సీఆర్‌ఎంటీలు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

లారీ చోరీ ఘటనపై కేసు నమోదు

కంకిపాడు: లారీ చోరీ ఘటనపై స్థానిక పోలీసుస్టేషన్‌లో సోమవారం రాత్రి కేసు నమోదైంది. ఎస్ఐ కె.సుధాకర్ కథనం మేరకు.. పట్టణానికి చెందిన బొమ్మదేవర వెంకట సుబ్బారావుకు చెందిన ఆయిల్ ట్యాంకర్ (లారీ)ను ఈ నెల రెండో తేదీ శనివారం పట్టణంలోని మార్కెట్‌యార్డు ఎదురుగా ఉన్న కల్యాణ మండపం ఖాళీ స్థలంలో పార్కింగ్ చేశారు. సోమవారం ఆ ఆయిల్ ట్యాంకర్ కనిపించ లేదు. ట్యాంకర్ చోరీకి గురైందని నిర్ధారించుకున్నారు. బొమ్మదేవర వెంకట సుబ్బారావు ఇచ్చిన ఫిర్యాదుపై చోరీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సుధాకర్ తెలిపారు.

కొమ్ము పురుగు నివారణకు చర్యలు తీసుకోవాలి

గన్నవరం రూరల్: మండలంలోని పామాయిల్ సాగుచేసే రైతులు కొమ్ము పురుగు నివారణకు చర్యలు తీసుకోవాలని మండల హార్టీకల్చర్ అధికారి ఇ.హరిచంద్ సూచించారు. మండలంలోని మాదలవారిగూడెం, మెట్లపల్లి, తెంపల్లి గ్రామాల్లో పలువురు రైతులు పామాయిల్ తోటలు సాగు చేస్తున్నారు. కొమ్ము పురుగు లేదా మొవ్వ కొట్టు పురుగు మొవ్వ భాగంలో చేరి మొవ్వను నాశనం చేస్తుందని హరిచంద్ తెలిపారు. దీని నివారణకు కార్బోసిరాన్ 3జీ గుళికలు ఐదు గ్రాములు, ఐదు గ్రాముల ఇసుకలో కలిపి పలుచటి వస్త్రంలో ఈ మిశ్రమాన్ని మూటకట్టి చెట్టు మొవ్వలో ఉంచాలని సూచించారు. ఈ చర్యల ద్వారా పామాయిల్‌ను లాభసాటిగా సాగు చేసుకోవచ్చని సూచించారు.

పిచ్చిరెడ్డి కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ

ఉయ్యూరు: మాజీ ఎంపీపీ భీమవరపు పిచ్చిరెడ్డి భౌతికకాయానికి ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి నివాళులర్పించారు. రోడ్డు ప్రమాదంలో పిచ్చిరెడ్డి మృతి చెందిన ఘటన విదితమే. ఆయన భౌతికకాయాన్ని మండలంలోని పెద ఓగిరాల గ్రామంలో సోమవారం ఎమ్మెల్యే పార్థసారథి సందర్శించి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. సర్పంచ్ త్రిపురం లక్ష్మి, ఎంపీటీసీ సభ్యుడు గుంటక నాగిరెడ్డి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు రాజులపాటి రామచంద్రరావు నివాళులర్పించారు. మాజీ ఎమ్మెల్యే బోడె ప్రసాద్, మాజీ ఎమ్మెల్సీ వై.వి.బి.రాజేంద్రప్రసాద్‌తో పాటు ఆ పార్టీ శ్రేణులు పిచ్చిరెడ్డి అంతిమయాత్రలో పాల్గొన్నారు.

కొత్త పింఛన్లు పంపిణీ



ఉయ్యూరు: వైఎస్సార్ పింఛన్ కానుక పంపిణీ కొనసాగుతోంది. ఈ నెలలో మంజూరైన కొత్త పింఛన్లను గ్రామాల్లో ప్రజాప్రతినిధులు, గృహ సారథులు పర్యవేక్షణలో వలంటీర్లు సోమవారం పంపిణీ చేశారు. మండలంలోని ఆకునూరు గ్రామంలో ఐదుగురు లబ్ధిదారులకు కొత్త పింఛన్లను ఇంటింటికీ వెళ్లి అందజేశారు.

వైభవంగా శ్రావణమాస ఉత్సవాలు



గన్నవరం: స్థానిక పాతగన్నవరంలోని వేంచేసి యున్న శ్రీలక్ష్మీతిరుపతమ్మ ఆలయంలో శ్రావణమాస ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. గోపయ్య సమేత లక్ష్మీతిరుపతమ్మకు, ఆలయంలోని ఉపదేవతలకు సోమవారం ప్రత్యేక అలంకరణలు చేశారు. తొలుత ఉభయదాతలు జాస్తి నరసింహారావు, ఆదిలక్ష్మి దంపతులు, జాస్తి దినేష్, మౌనిక దంపతులు సౌజన్యంతో పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు జాస్తి శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

కంకిపాడు నుంచి ఆర్టీసీ అడ్వాన్స్ టికెట్ బుకింగ్

కంకిపాడు: కంకిపాడు బస్టాండు నుంచి అడ్వాన్స్ టికెట్ బుకింగ్, సరుకు రవాణా సేవలు అందుబాటులోకి వచ్చాయని ఉయ్యూరు ఆర్టీసీ డిపో మేనేజరు కె.ఎస్.ఆర్. కె.ప్రసాద్ తెలిపారు. ఆయన స్థానిక విలేకరులతో సోమవారం మాట్లాడారు. కంకిపాడు పరిసర గ్రామాల ప్రజలకు మెరుగైన ఆర్టీసీ సేవలు అందుబాటులోకి తెచ్చేందుకు సంస్థ ఈ సౌకర్యాలను కల్పించిందని తెలిపారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

అంగన్‌వాడీ కేంద్రాలకు కుర్చీల బహూకరణ



కుర్చీలను అందచేస్తున్న ఎమ్మెల్యే వంశీమోహన్

అంబాపురం(విజయవాడరూరల్): అంబాపురం గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకులు తోడేటి బెంజిమెన్, నల్లమోతు చంద్రశేఖర్ గ్రామంలోని రెండు అంగన్‌వాడీ కేంద్రాల కోసం కొనుగోలు చేసిన కుర్చీలను ఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్ చేతుల మీదుగా సోమవారం అందజేశారు. గ్రామంలోని డాక్టర్ వైఎస్సార్ హెల్త్ క్లినిక్ కూడా కుర్చీలను వితరణగా ఇచ్చారు. మొత్తం 25 కుర్చీలను అంగన్‌వాడీ టీచర్లకు ఎమ్మెల్యే అందజేశారు. ఎంపీపీ చెన్ను ప్రసన్నకుమారి, జెడ్పీటీసీ సభ్యుడు కె.సువర్ణరాజు, దాతలు బెంజిమెన్, చంద్రశేఖర్ పాల్గొన్నారు. హెల్త్ క్లినిక్ భవన నిర్మాణానికి స్థలం కేటాయించాలని ఎమ్మెల్యే వంశీకి కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ భాగ్యశ్రీ విజ్ఞప్తి చేశారు. సంబంధిత అధికారులతో మాట్లాడి స్థలం సమకూరుస్తామని ఎమ్మెల్యే వంశీ హామీ ఇచ్చారు.

ఎమ్మెల్యే చొరవతో స్థల వివాదం పరిష్కారం



స్థల వివాదంపై స్థానికులతో చర్చిస్తున్న ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి

పెనమలూరు: మండలంలోని యనమలకుదురులో ప్రభుత్వ స్థలం విషయమై తలెత్తిన వివాదం ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి చొరవతో పరిష్కారమైంది. యనమలకుదురు శివలింగేశ్వరనగర్‌లో ప్రభుత్వ స్థలం ఉంది. ఇక్కడ అన్నికులాలకు కలిపి కమ్యూనిటీ హాల్ నిర్మించాలని చాలా కాలంగా ప్రతిపాదన ఉంది. పద్మశాలీ కులస్తులు గుడి నిర్మాణం కోసం స్థలం కేటాయించాలని ఎమ్మెల్యే పార్థసారథిని కోరారు. ఈ ప్రతిపాదనను పరిశీలించి అనువైన స్థలం మంజూరు చేయాలని తాడిగడప మునిసిపల్ కమిషనర్ ప్రకాశరావుకు ఎమ్మెల్యే సూచించారు. శివలింగేశ్వర్‌నగర్‌లో కమ్యూనిటీహాల్ నిర్మాణం చేయాలని ప్రతిపాదనలో ఉన్న స్థలంలో గుడి నిర్మాణం చేసుకోవాలని పద్మశాలి కుల సంఘ సభ్యులకు కమిషనర్ ప్రకాశరావు సూచించారు. దీంతో వారు గుడి నిర్మాణానికి శంకుస్థాపన చేయడానికి సోమవారం రంగం సిద్ధం చేయగా స్థానికుల నుంచి అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి. దీంతో ఉద్రిక్తత చోటు చేసుకుంది. ఈ విషయం తెలిసి పోలీసులు ఘటనాస్థలానికి చేరుకున్నారు. ఎమ్మెల్యే పార్థసారథి కూడా వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని, అన్ని వర్గాల వారితో చర్చించి సమస్య పరిష్కారం చేశారు.

రూ.20 లక్షలు మంజూరు

అన్నికులాలకు సంబంధించి శివలింగేశ్వర్‌నగర్‌లో కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి రూ.10 లక్షలు నిధులు ఇస్తానని ఎమ్మెల్యే పార్థసారథి హామీ ఇచ్చారు. గతంలో అనుకున్న విధంగానే కమ్యూనిటీ హాల్ నిర్మించాలని సూచించారు. గుడి నిర్మాణానికి శేషమాంబ ఆశ్రమం వద్ద ఉన్న ప్రభుత్వ స్థలాన్ని చూపారు. అగ్నికుల క్షత్రియులకు కూడా కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి స్థలం చూపి వారికి కూడా మరో రూ.10 లక్షలు మంజూరు చేశారు. అన్నివర్గాల వారికి న్యాయం చేయటమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే పార్థసారథి పేర్కొన్నారు. స్థానికంగా తలెత్తిన సమస్యను ఎమ్మెల్యే సామరస్యంగా పరిష్కారం చేయటంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

ఆడుదాం.. ఆంధ్రను పకడ్బందీగా నిర్వహించాలి



పెనమలూరులో సమావేశం నిర్వహిస్తున్న ఎంపీడీఓ సునీతాశర్మ

పెనమలూరు: ఆడుదాం.. ఆంధ్ర కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని ఎంపీడీఓ సునీతా శర్మ సూచించారు. పెనమలూరు మండల పరిషత్ కార్యాలయంలో ఆమె అధికారులతో సోమవారం సమావేశం నిర్వహించారు. అక్టోబర్ రెండు నుంచి నవంబర్ ఎనిమిదో తేదీ వరకు గ్రామస్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీలు జరుగుతాయని వివరించారు. 15 ఏళ్లు పై బడిన యువతీయువకులు ఈ పోటీల్లో పాల్గొనొచ్చని సూచించారు. క్రికెట్, వాలీబాల్, బ్యాడ్మింటన్, కబడ్డీ, ఖోఖో అంశాల్లో పోటీలు జరుగుతాయని తెలిపారు. ఆయా గ్రామాలకు చెందిన క్రీడాకారులు సచివాలయాల్లో వివరాలు నమోదు చేసుకోవాలని సూచించారు. నియోజకవర్గం, జిల్లా, రాష్ట్ర స్థాయిలో పాల్గొ జట్లకు ప్రైజ్ మనీ ఉంటుందన్నారు. ఈ సమావేశంలో ఎంఈఓలు, పాఠశాలల పీడీలు, సచివాలయాల సిబ్బంది పాల్గొన్నారు.

ప్రొద్దుటూరు ఉపసర్పంచ్‌గా సుధారాణి



ఉపసర్పంచ్‌గా ధ్రువీకరణ పత్రం అందుకుంటున్న బొట్ట సుధారాణి

కంకిపాడు: మండలంలోని ప్రొద్దుటూరు గ్రామ ఉపసర్పంచ్‌గా బొట్ట సుధారాణి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఉప సర్పంచ్ ఎన్నిక ప్రక్రియ స్థానిక పంచాయతీ కార్యాలయంలో సోమవారం జరిగింది. ఎన్నికల అధికారి, ఈఓఆర్డీ పీ.వి.ఎస్. మైథిలి ఎన్నిక ప్రక్రియను నిర్వహించారు. ఇటీవల నిర్వహించిన ఉప ఎన్నికల్లో గ్రామంలోని నాలుగో వార్డు నుంచి బొట్ట సుధారాణి ఏకగ్రీవంగా ఎన్నికైన విషయం తెలిసిందే. ఉప సర్పంచ్‌గా బొట్ట సుధారాణిని సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ మేరకు సుధారాణికి ఎన్నికల అధికారి మైథిలి ఎన్నిక ధ్రువీకరణ పత్రం అందించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఈడే శివనాగలక్ష్మి, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

మోసం చేసిన భార్యాభర్తలపై కేసు

పెనమలూరు: కారు తీసుకుని మోసం చేసిన భార్యాభర్తలపై పెనమలూరు పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. సీఐ శ్రీనివాసరావు కథనం మేరకు.. పెనమలూరు శ్రీహరి గార్డెన్స్‌లో నివసించే తేలప్రోలు శ్రీనివాస్‌కు విజయవాడ ఎస్ఆర్ పేటలో జూమ్‌కార్ సేల్స్ ఇండ్ సర్వీసెస్ యజమాని అల్లూరి శరత్‌చంద్రవర్మ, అతని భార్య జ్యోత్స్నప్రియతో పరిచయం ఉంది. శ్రీనివాస్ గత ఏడాది తన పాతకారును వారి ద్వారా విక్రయించాడు. వారి వద్ద మరో కారు కొన్నాడు. కొన్న కారుపై ఫైనాన్స్ తీసుకున్నాడు. అయితే ఈ ఏడాది జనవరిలో అల్లూరి శరత్‌చంద్రవర్మ, జ్యోత్స్నప్రియ పెనమలూరు వచ్చి చిన్నపని ఉందని శ్రీనివాస్ కొన్న కారును తీసుకెళ్లారు. ఆ తరువాత కారు తీసుకొచ్చి అప్పగించలేదు. అప్పటి నుంచి భార్యాభర్తలు కనిపించకుండా తిరుగుతున్నారని, తన కారు తీసుకుని మోసం చేశారని బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. మోసం చేసిన భార్యాభర్తలపై పోలీసులు చీటింగ్ కేసు నమోదు చేశారు.

వృద్ధురాలి అదృశ్యంపై కేసు

పెనమలూరు: మండలంలోని కానూరులో ఓ వృద్ధురాలు అదృశ్యమైన ఘటనపై పెనమలూరు పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం మేరకు.. విజయవాడ మాచవరం ఆంజనేయస్వామి గుడి ప్రాంతానికి చెందిన గుడివాడ శ్రావణి కానూరు మహదేవపురంలో ఉన్న తల్లిదండ్రులు డి.సరస్వతి, ఈశ్వరరావు ఇంటికి ఐదు రోజుల క్రితం వచ్చింది. ఈ నెల ఒకటో తేదీన తల్లిదండ్రుల మధ్య సొమ్ము విషయమై గొడవ జరిగింది. రెండో తేదీ ఉదయం తల్లి సరస్వతి ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి ఇంటికి రాలేదు. బంధువుల ఇళ్లల్లో వెతికినా ఆమె ఆచూకీ తెలియలేదు. దీంతో సరస్వతి అదృశ్యమైందని శ్రావణి పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.